క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్ రాజీనామా



తాండూరు: తాండూరు మున్సిపాలిటీ 13 వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డికి లేఖను పంపించారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీలో 13వ వార్డు కౌన్సిలర్‌ను ఆశించారు. రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయనకు టికెట్ దక్కలేదు. దీంతో నాడు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కౌన్సిలర్‌గా విజయం సాధించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగారు. అయితే కొంత కాలంగా శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అధికార పార్టీ కౌన్సిలర్లు తమ వార్డులను అభివృద్ధి చేశారని, తాను కాంగ్రెస్ కౌన్సిలర్‌గా మూడున్నరేళ్ల కాలంలో ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయానని తన వర్గీయులతో వాపోయినట్లు తెలిసింది. అంతే కాకుండా.. మరో రెండు రోజుల్లో శ్రీనివాస్‌రెడ్డి.. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు సమాచారం.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి



టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న దేశం నేతలు

బంట్వారం: తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం సైనికుల్లా పని చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా గురువారం రొంపల్లిలో టీడీపీ జెండా ఎగుర వేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే నాడు టీడీపీ ఆవిర్భవించిందని, పార్టీ పూర్వ వైభవం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

మర్పల్లిలో..

మర్పల్లి: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నేతలు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండునాయక్, మాజీ ఎంపీటీసీ శేకర్ యాదవ్, పార్టీ మండల నాయకులు ప్రేమ్‌కుమార్, ప్రభు, జయరాజ్, మహేశ్, నర్సయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ఎంపీపీ విఫలం

యాలాల: ప్రజాసమస్యల పరిష్కారంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా విఫలమయ్యారని, సర్వసభ్య సమావేశంలో లేవనెత్తే సమస్యలు సైతం పరిష్కారం కాకపోవడంతోనే సభకు దూరంగా ఉంటున్నామని ఎంపీటీసీల ఫోరం యాలాల మండల అధ్యక్షుడు గరివప్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మొండి వైఖరికి వ్యతిరేకంగా తాము నిరసన రూపంలో సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యామే తప్ప.. తమను విహారయాత్రలకు ఎవరూ తీసుకెళ్లలేదని, అభివృద్ధి నిధుల విషయమై స్వప్రయోజనాల కోసం ఎంపీటీసీలు ఇలా వ్యవహరిస్తున్నారంటూ ఎంపీపీ పేర్కొనడం తగదని హితవు పలికారు. ఎంపీపీపై తాము అవిశ్వాస తీర్మానం పెట్టే ఆలోచన కూడా లేదని వెల్లడించారు.

ఆర్ఐపై వేటు

- భాగ్యలక్ష్మిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- తక్షణమే అమలు చేయాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో వసూళ్లకు పాల్పడుతున్న బషీరాబాద్ ఆర్ఐ భాగ్యలక్ష్మిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 20న 'రూ.15 వేలు ఇస్తేనే కల్యాణ లక్ష్మి చెక్కు ఇస్తా' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. సదరు అధికారిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే తమ ఆదేశాలను అమలు చేయాలని తాండూరు ఆర్డీఓ, బషీరాబాద్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా అర్హత లేని దరఖాస్తుదారులు కల్యాణలక్ష్మి ఇప్పించాలని తనపై ఒత్తిడి తెచ్చారని, తాను అంగీకరించకపోవడంతో ఆరోపణలు చేశారని ఆర్ఐ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రంజాన్ దుస్తుల పంపిణీ

బంట్వారం: రంజాన్ పండుగ పురస్కరించుకొని కోట్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ముస్లింలకు రంజాన్ కానుక (దుస్తులు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్, నాయకులు సమ్మయ్య, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ పోయిందా.. ఇట్టే పట్టేయొచ్చు

మారుతున్న జీవన శైలికి అనుగుణంగా వచ్చిన మార్పుల్లో సెల్‌ఫోన్ ఒకటి. ప్రస్తుతం మనిషి ఈ చరవాణితోనే ఉన్నచోట నుంచే అన్ని పనులు చక్కబెట్టేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ లేనిదే రోజు గడవని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో మొబైల్ పోతే వారి దినచర్య పూర్తిగా తల్లకిందులవుతుంది. దాన్ని ఎలా గర్తించాలో తెలియక చాలా ఇబ్బంది పడతారు. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొత్తగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ ఎక్కడుందో ఇట్టే పట్టేయొచ్చు.

అందుబాటులోకి సీఈఐఆర్
- బ్లాక్ చేయొచ్చు.. జాడ తెలుసుకోవచ్చు
- సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యకు సులువైన పరిష్కారం

దౌల్తాబాద్: ఒకప్పుడు పోయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేయడం చాలా కష్టంగా ఉండేది. ఫిర్యాదు చేస్తే విచారణకే నెలలకొద్ది సమయం పట్టేది. అయినా సెల్‌ఫోన్ దొరుకుతుందనుకున్న ఆశ ఉండేదికాదు. అందుబాటులోకి వచ్చిన సాంకేతికత ఆధారంగా సెల్‌ఫోస్ బ్లాక్ చేయడం, ట్రేస్ చేయడం ఇప్పుడు అత్యంత సులువుగా మారింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ పేరిట సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రేషన్ (సీఈఐఆర్) అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాక, సీఈఐఆర్‌లో ఫిర్యాదు, రిజిస్టర్ చేస్తే ఫోన్ బ్లాక్ చేయడం, ఎవరైనా వాడినా ఎలా ట్రేస్ చేయొచ్చో పోలీస్‌శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తోంది. ఇదిలా ఉండగా.. మండలంలో కాశప్ప అనే వ్యక్తి మూడు రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకోగా కేవలం 72 గంటల్లో రికవరీ చేశారంటే ఈ సాంకేతికత పరిజ్ఞానం ఎంత బాగా ఉపయోగపడుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఇలా ఫిర్యాదు చేయాలి..

ఆన్‌లైన్‌లో ముందుగా డివైస్ ఇన్ఫర్మేషన్ అంటూ ఓ కాలమ్ కనిపిస్తుంది. అందులో అడిగిన విధంగా మొబైల్ నంబర్లు ఎంటర్ చేయాలి. కింది కాలంలో ఐఎంఈఐ-1, ఒక వేళ డ్యూయల్ సిమ్ ఉన్న మొబైల్ అయితే ఐఎంఈఐ-2తో పాటు పోయిన ఫోన్ ఏ కంపెనీ, మోడల్‌తో పాటు, ఫోన్ కొనుగోలు బిల్లుకు సంబంధించిన ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఐఎంఈఐ వివరాలు ఫోన్ బాక్స్‌పైన, బిల్లులోనూ ఉంటాయి. మరో కాలంలో ఫోన్ పోగొట్టుకున్న ప్రాంతం, తేదీ, జిల్లా, రాష్ట్రం ఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారో ఆ ఠాణా పేరు, కంప్లయింట్ నంబర్ ఎంటర్ చేసి దానికి సంబంధించిన ఫొటో అప్‌లోడ్ చేయాలి.



రికవరీ చేసిన ఫోన్‌ను బాధితుడికి అందజేస్తున్న ఏఎస్పీ

జిల్లాలోనే మొదటి రికవరీ



మండలానికి చెందిన ఓ వ్యక్తి మూడు రోజుల క్రితం ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సీఈఐఆర్ సాంకేతికత విధానం ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను మూడు రోజుల్లో రికవరీ చేశాం. జిల్లాలోనే మొదటి ఫోన్‌ను ఈ విధానం ద్వారా తిరిగి రాబట్టగలిగాం. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నట్లయితే సీఈఐఆర్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. – రమేష్‌కుమార్, ఎస్ఐ, దౌల్తాబాద్

తాగునీటి సమస్యకు చర్యలు

దోమ: తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రెండో వార్డులో తాగునీటి మోటర్‌కు మరమ్మతు చేయించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు సరఫరా కాని పక్షంలో.. బోరు ద్వారా నీటిని పట్టుకోవాలని గ్రామస్తులకు చెప్పారు. నీటిని వృథా చేయరాదని, ఎండలు మండుతున్న తరుణంలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందనే ఉద్దేశంతో బోరు బాగు చేయించామని తెలిపారు. గ్రామంలో ఎక్కడ తాగునీటి సమస్య వచ్చినా సమాచారం ఇవ్వాలని చెప్పారు. వార్డు సభ్యురాలు నిరోష, గ్రామస్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమ్మె విరమించేది లేదు

మర్పల్లి: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన నిరసన దీక్ష గురువారం నాటికి 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది ఐకేపీ సిబ్బంది వీఓఏలు సమ్మెను విరమించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా.. ప్రభుత్వం తమకు కనీస వేతనం రూ.15 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీఓఏలు స్వర్ణలత, సునీత, నర్సింహులు, సుభాష్, గౌరమ్మ, నర్సింహులు పాల్గొన్నారు.

నిత్యం మీ చెంతనే ఉంటా..

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ మహిళా మరుగుదొడ్లను వార్డు కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించి, కాలనీల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలపై ఫిర్యాదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం కొడంగల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 24 గంటలు మీ కోసం అందుబాటులో ఉంటానని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మధుయాదవ్, వెంకట్‌రెడ్డి, రహతాబేగం, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

80 శాతంపైగా గ్రామాల్లో అభివృద్ధి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో 80శాతానికి పైగా గ్రామాల్లో అభివృద్ధి సాకారమవుతుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

కొత్తూరులో సీసీరోడ్లు, జానకంపల్లిలో పల్లెప్రకృతివనం, క్రీడాప్రాంగణం, శ్మశానవాటికను ఎమ్మెల్యే ప్రారంభించారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు కొత్త బట్టలు అందజేశారు. ఎంపీపీ హేమీబాయి, వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ పాండు, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శేరినారాయణరెడ్డి, చాంద్‌పాషా, రామునాయక్ పాల్గొన్నారు.

నాలుగేళ్లలో నాలుగు దశాబ్దాల అభివృద్ధి

- త్వరలో ఇళ్ల నిర్మాణాల కోసం 'గృహలక్ష్మి'
- సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతా
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: గడిచిన నాలుగేళ్ల కాలంలో.. నలభై ఏళ్లుగా జరగని అభివృద్ధి పనులు చేశానని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. ఒకేసారి రూ.134 కోట్ల నిధులు తాండూరు నియోజకవర్గానికి తీసుకువచ్చానని, చిన్న గ్రామానికి ఒకేసారి రూ.50 లక్షలు కేటాయించింది కూడా తానేనంటూ చెప్పారు. 'పల్లెపల్లెకు పైలెట్' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మంతన్‌గౌడ్, మంతన్‌గౌడ్ తండా, బషీరాబాద్, కొర్విచెడ్, కొర్విచెడ్‌గని, మసాన్‌పల్లి, బాద్లాపూర్, బాద్లాపూర్ తండా, కాశీంపూర్, మల్కన్‌గిరి, రెడ్డిఘణాపూర్, మంతట్టి గ్రామాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ఇప్పుడు ప్రారంభిస్తున్న అభివృద్ధి ఫలాలు.. వచ్చే మూడు మాసాల్లో కనిపిస్తాయని చెప్పారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. బషీరాబాద్ మండల కేంద్రాన్ని రూ.3 కోట్లతో రూపురేఖలు మార్చేస్తామని, గ్రామాల్లో ప్రజా సమస్యలపై ప్రజాబంధు ద్వారా గుర్తించి పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. ఇళ్లు నిర్మించుకోవడానికి పేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు మంజూరు చేస్తామని, గొర్రెల పంపిణీ కూడా త్వరలో జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పంజుగుల శ్రీశైల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాము నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, సీనియర్ నాయకుడు నర్సిరెడ్డి(రాజు), సర్పంచులు గాయత్రి, వసంత, ప్రియాంక, సునీత, సాబేర్, వెంకటయ్య, వంశీకృష్ణ, దశరథ్, ఎంపీటీసీలు, నాయకులు గోపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అనంతయ్య, అశోక్‌గౌతం, ఎక్మాయి రాజుగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు



కాశీంపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

క్రమబద్ధీకరణకు మరో అవకాశం

- తిరస్కరణకు గురైన వాటికీ చాన్స్
- 30లోగా మీ సేవలో దరఖాస్తు చేసుకోండి
- ఆర్డీఓ అశోక్ కుమార్

తాండూరు టౌన్: నిరుపేదలు గతంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చినట్లు తాండూరు ఆర్డీఓ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో అధికారులు, మీసేవా కేంద్ర ప్రతినిధులతో సమావేశమయ్యారు. దరఖాస్తు సందర్భంగా లబ్ధిదారులకు దిశానిర్దేశం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సరైన ధ్రువ పత్రాలు ఉంటేనే రెగ్యులరైజేషన్ అర్జీలు స్వీకరించాలని మీసేవా ప్రతినిధులను ఆదేశించారు.

జీఓ 58,59 ప్రకారం..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలు గతంలో 125 గజాల మేర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నట్లైతే జీఓ 58 ప్రకారం ఉచితంగా క్రమబద్ధీకరించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. 125 గజాల కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి ఉంటే, దానికి మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వం సూచించిన రుసుము చెల్లించినట్లైతే జీఓ 59 ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తామని చెప్పారు. అయితే 2020 జూన్ 2వ తేదీ లోగా ఆక్రమించుకున్న స్థలంలో నిర్మాణం చేపట్టిన వారికి మాత్రమే అవకాశముంటుందని, ఇందుకు సంబంధించిన ఆస్తిపన్ను, విద్యుత్, నల్లా బిల్లు వంటి రసీదులు దరఖాస్తుతో పాటు సమర్పించాలని వెల్లడించారు. గతంలో రెండుసార్లు క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం అవకాశం ఇచ్చినప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు చేసుకోవచ్చని, అలాగే గతంలో తిరస్కరణకు గురైన వారు కూడా అర్జీ పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. శ్మశాన వాటిక, చెరువు శిఖం భూములు, ప్రభుత్వ రహదారులను ఆక్రమించినట్లైతే.. వాటిని క్రమబద్ధీకరించేది లేదని తేల్చి చెప్పారు. లబ్ధిదారులు ఈనెల 30వ తేదీ లోగా మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాండూరు తహసీల్దార్ చిన్నప్పలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్ కుమార్. చిత్రంలో తహసీల్దార్ చిన్నప్పల నాయుడు

పరిగిలో..

పరిగి: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకున్న ప్రజలు క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ రాంబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 125 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నవారందరూ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని, అర్హులందరూ అర్జీ పెట్టుకోవాలని చెప్పారు.

మత సామరస్యానికి మారు పేరు తెలంగాణ

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: మత సామరస్యానికి మారు పేరు తెలంగాణ అని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సూపర్ డీలక్స్ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్ ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలను సమానంగా చూస్తున్నారని, వారు పండుగలను ఘనంగా జరుపుకొనేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, భిక్షపతి, రాజు, ముస్లింలు మైబల్లి, ఖాదర్, అజం దితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్

హామీలు మరిచిన ప్రభుత్వం

- తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం
- హాత్‌సే హాత్ జోడో యాత్రలో హస్తం నేతలు

దౌల్తాబాద్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని, తిరిగి ఇప్పుడు ఓట్ల కోసం వస్తారని, ఆ పార్టీని ప్రజలు నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం కుదురుమళ్ల, నందారం గ్రామాల్లో ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ పథకాలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రైతు రుణమాఫీ, రూ.500లకే సిలిండర్, పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే జాతీయ పార్టీ కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, రాజు, దస్తప్ప, రఘుపతి, మహిపాల్, రెడ్యానాయక్, కష్ణ, లాలు, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

అవసరమున్న ప్రతి ఒక్కరికీ 'ఉపాధి'

కుల్కచర్ల: పని అవసరమున్న ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' కల్పించడం జరుగుతుందని ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి చెప్పారు. గురువారం అంతారం గ్రామంలో ఉపాధి కూలీలకు పనుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవికి తగినట్లుగా పనులు చేయడం జరుగుతుందని, పనుల నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని చెప్పారు. అడిగిన వారికి పని కల్పించడం జరుగుతుందని, కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛంద' సేవలు అభినందనీయం

- అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బడికి ప్రహరీ నిర్మాణం
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు పాటుపడటం అభినందనీయమని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం సాల్వీడు జెడ్పీ పాఠశాలకు అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణం, విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్లు అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రహరీ పనులు ప్రారంభించి మాట్లాడారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని చెప్పారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు ఉపయోగకరంగా నిలిచే కార్యక్రమాల నిర్వాహణకు స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు ముందుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ఎంఈఓ హబీబ్ అహ్మద్, స్థానిక సర్పంచ్ బాలయ్య, సొసైటీ డైరెక్టర్ కొండయ్య, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్నన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

కబ్జా కోరల్లో సర్కారు జాగా

తాండూరు టౌన్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలోని డాగ్‌బంగ్లా ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 135లోని ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని, కొందరు అధికార పార్టీకి చెందిన బడా నాయకులు రాత్రికిరాత్రే కబ్జాకు పాల్పడుతూ కంటైనర్లను ఏర్పాటు చేశారని ఆరోపించారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్

సంక్షిప్త వార్తలు

● ఇఫ్తార్ విందులో ఎంపీ రంజిత్ రెడ్డి



ముస్లింలకు ఖర్జూర తినిపిస్తున్న ఎంపీ

నవాబ్ పేట్: ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి ఖర్జూర తినిపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, సర్పంచులు, నాయకులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

● పేదలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: పేద ప్రజలకు తాము అండగా నిలుస్తామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. రాంనగర్ గ్రామపంచాయతీ గోప్యానాయక్ తండాలో చందర్ నాయక్ ఇటీవల మృతిచెందగా.. గురువారం బాధిత కుటుంబీకులను పరామర్శించి, తక్షణ సాయంగా రూ.5వేలు అందజేశారు.

● సదస్సును జయప్రదం చేయండి

అనంతగిరి: ఈ నెల 23న హైదరాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే బీసీ జర్నలిస్టుల సదస్సును జయప్రదం చేయాలని సీనియర్ జర్నలిస్టు, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తొలిసారిగా 2వేల మందితో సదస్సు ఏర్పాటు చేస్తున్నామని బీసీ జర్నలిస్టులు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు.

● 23న బసవేశ్వర జయంతి

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 23న మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ తెలిపారు. ఈ మేరకు గురువారం వీరశైవ సమాజం ప్రతినిధులతో కలిసి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

● కంటివెలుగును వినియోగించుకోండి

పెద్దేముల్: కంటివెలుగును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మట్ట భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం నాగులపల్లి గ్రామంలో నేత్ర శిబిరాన్ని సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు సురేఖలు ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

● అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త

బొంరాస్‌పేట: అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక సిబ్బంది చెప్పారు. గురువారం రేగడిమైలారంలో ఫైర్ యాక్సిడెంట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పరిగిలో..

పరిగి: అగ్రిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుకోకుండా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే సిలిండర్‌ను ఏ విధంగా అదుపులోకి తేవాలో వివరించారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారులు సూచించారు.

● 25న మహాధర్నా

అనంతగిరి: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-82) సమస్యల సాధనకై ఈనెల 25న మహాధర్నా చేపడుతున్నట్లు వికారాబాద్ జిల్లా యూనియన్ ప్రతినిధులు జమీల్, జైపాల్‌రెడ్డి, నర్సింహులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్.. విద్యుత్ సెక్టార్లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేసే వారిని పర్మినెంట్ చేస్తామని చెప్పి చేయడం లేదన్నారు. నిరసనగా నిర్వహించే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

● దళితరత్న అవార్డు గ్రహీతకు సత్కారం

పూడూరు: సమాజ సేవలో భాగస్వాములు అయినప్పుడే సమాజంలో మార్పులు సాధ్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య అన్నారు. గురువారం దేవనోనిగుడలో దళితరత్న అవార్డు గ్రహీత దేవనోనిగుడ వెంకటయ్యను స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వలాభం కోసం కాకుండా.. సమాజ మార్పు కోసం సమయం కేటాయించాలని సూచించారు. విద్య, వైద్యం ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, గ్రామీణ ప్రాంత పేదలకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చన్న, నాయకులు ఖలీల్, తిర్మల్‌రావు, పాషా, రఫీ, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.